
సాక్షి
ప్రకాశం

బుధవారం । 30 । అక్టోబర్ । 2024



కాసుల కోసం.. ఇంత కక్కుర్తా

మార్కాపురం మున్సిపాలిటీలో కూటమి నాయకులు పారిశుద్ధ్య కార్మికుల పొట్ట కొడుతున్నారు. కార్మికుల దగ్గర నగదు వసూలు చేస్తున్నారు. - 8లో..



బెల్ట్ తీయాల్సిందే..

బెల్టుషాపులు పెట్టినా, వాటికి మద్యం సరఫరా చేసినా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మున్సిపల్ స్కూళ్లలో పదోన్నతి జాబితా విడుదల

ఒంగోలు సిటీ: జిల్లాలోని మున్సిపల్ మేనేజ్మెంట్ స్కూళ్లలో ఉద్యోగ ఉన్నతుల సీనియారిటీ జాబితా వెబ్‌సైట్లో ఉంచామని జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులకు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ నుంచి స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించామని పేర్కొన్నారు. సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే నవంబరు 1 తేదీలోపు సంప్రదించాలని కోరారు. వివరాలు prakaram.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. హెడ్మాస్టర్ గ్రేడ్ 2 పోస్టులకు ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు 6వ తేదీ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి పొందిన వారికి 8వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. హెడ్మాస్టర్లు, స్కూల్‌అసిస్టెంట్లకు సంబంధించిన అబ్జెక్షన్స్‌ను వచ్చేనెల 1వ తేదీలోపు సమర్పించాలన్నారు. అలాగే హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల సినియారిటీ లిస్టును నవంబరు 4వ తేదీ ప్రకటిస్తారన్నారు.

అప్తమాలజీ క్విజ్‌లో ఓఎంసీ పీజీల ప్రతిభ



పీజీ డాక్టర్లను ప్రత్యేకంగా అభినందిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు

ఒంగోలు టౌన్: డా.ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ జోనల్ సీఎంఈ కాన్ఫరెన్స్‌లో అప్తమాలజీ క్విజ్ విభాగంలో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన పీజీలు ప్రతిభ కనపరిచారు. ఈనెల 27వ తేదీ గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహించిన పోటీల్లో కళాశాలకు చెందిన పోస్టుగ్రాడ్యుయేట్ డాక్టర్లు ఇ.నిఖిల, బి.జాహ్నవి బహుమతులు గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డా.ఏడుకొండలు తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్ ఛాంబర్లో వారిని ప్రత్యేకంగా అభినందించారు.

తరల్ బేస్‌లైన్ ఫలితాలు యాప్‌లో నమోదు చేయాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంఓ రమేష్

ఒంగోలు సిటీ: తెలుగు, గణితం సబ్జెక్టుల్లో 3, 4, 5వ తరగతులకు నిర్వహించిన తరల్ బేస్ లైన్ టెస్ట్ ఫలితాలను ఉపాధ్యాయులందరూ యాప్ ద్వారా నమోదు చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ అన్నారు. స్థానిక విరాట్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంఓ రమేష్ మాట్లాడుతూ 4వ తరగతి విద్యార్థుల ఆంగ్ల భాష సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్. సంధ్య పాల్గొన్నారు.

4 నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపరు-2 పరీక్షలు

ఒంగోలు సిటీ: నవంబరు 4వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపరు-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 4వ తేదీ మెయిన్ లాంగ్వేజ్ సంస్కృత పరీక్ష జిల్లాలో రెండు పాఠశాలల్లో మాత్రమే జరుగుతుందన్నారు. 6 నుంచి 8వ తేదీ వరకు ప్రతి రోజు రెండు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 2వ తేదీ ప్రశ్న పత్రాల బండిల్స్ మండల కేంద్రాలకు చేరుస్తారన్నారు. 3వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం గం.10 నుంచి గం.11 వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం గం.1.10 నుంచి గం.2.10 వరకు రెండో పరీక్ష జరుగుతుందని తెలిపారు. 4వ తేదీ ఓఎస్ఎస్‌సీ పరీక్ష, 6న తెలుగు, మ్యాథమేటిక్స్, 7న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంగ్లిష్ పరీక్షలు ఉంటాయి. అదే విధంగా 6, 7, 8 తరగతుల వారికి మధ్యాహ్నం గం.1.10 నుంచి గం.2.10 వరకు ఒక పరీక్ష, గం.2.20 నుంచి గం.3.20 వరకు రెండో పరీక్ష నిర్వహిస్తారు. 4వ తేదీ ఓఎస్ఎస్‌సీ-1/పర్షియా/అరబిక్ పరీక్ష, ఓఎస్ఎస్‌సీ-2/పర్షియా/అరబిక్ పరీక్షలు, 6న తెలుగు, మ్యాథమెటిక్స్, 7న హిందీ, జనరల్ సైన్స్ పరీక్షలు, 8న ఇంగ్లిష్, సోషల్‌స్టడీస్ పరీక్షలు ఉంటాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం గం.10 నుంచి గం.11 వరకు ఒక పరీక్ష, గం.11.15 నుంచి గం.12.15 వరకు రెండో పరీక్ష నిర్వహిస్తారు. 4వ తేదీ ఓఎస్ఎస్‌సీ-1/పర్షియా/అరబిక్ పరీక్ష, ఓఎస్ఎస్‌సీ-2/పర్షియా/అరబిక్ పరీక్షలు, 6న తెలుగు, మ్యాథమేటిక్స్ పరీక్షలు, 7న హిందీ, జనరల్ సైన్స్ పరీక్షలు, 8న ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

దివ్యంగా భవిత

- విద్యార్థుల్లో లోపాలను గుర్తించేందుకు 'ప్రశస్త్' యాప్
- వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్రవిద్యను అందించడమే లక్ష్యం
- ఉపాధ్యాయులతో సర్వే
- విద్యార్థుల సామర్థ్యాలపై తల్లిదండ్రులకు అవగాహన
- మొదటి దశలో 11,653 మంది
- రెండో దశలో 10,544 విద్యార్థులకు స్క్రీనింగ్

విద్యార్థుల్లో మానసిక, శారీరక లోపాలతో పాటు అభ్యాసన లోపాలు గుర్తించేందుకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్సు అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 'ప్రశస్త్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో 11,653, రెండో దశలో 10,544 విద్యార్థులకు స్క్రీనింగ్ చేశారు.

ఒంగోలు సిటీ: విద్యార్థుల్లో కొంతమందికి శారీరక, మానసిక సమస్యలుంటాయి. మరికొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. వారిని సకాలంలో గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు 'ప్రశస్త్' పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఉపాధ్యాయులు నిశితంగా పరిశీలించి గుర్తించిన లోపాలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) అందుబాటులోకి తెచ్చిన ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ యాప్ ద్వారా సర్వేను 2021వ సంవత్సరంలో ప్రారంభించారు. జిల్లాకు కేటాయించిన 1493 పాఠశాలల్లో 1390 మంది ప్రధానోపాధ్యాయులు, ప్రిన్స్‌పాల్స్, ఉపాధ్యాయులు యాప్‌లో ఐడీలను రూపొందించుకున్నారు. వీరిలో 1067 మంది ఉపాధ్యాయులు, 440 మంది ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్స్, 64 మంది స్పెషల్ టీచర్స్ ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ మొదటి దశకు స్క్రీనింగ్‌కు 11,653, రెండో దశ స్క్రీనింగ్‌కు 10,544 మంది విద్యార్థులు హాజరయ్యారు.

యాప్ వినియోగం ఇలా..

స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చడం, అశాస్త్రీయ నిర్ధారణ, లేబులింగ్ నుంచి రక్షణ, పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడమే ఈ యాప్ ముఖ్య ఉద్దేశం. ముందుగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లో ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఉపాధ్యాయుడి పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబరు, యూడైస్ కోడ్‌తో 'ప్రశస్త్' యాప్‌లో లాగిన్ కావాలి. ఆ తర్వాత విద్యార్థుల పేర్లు నమోదు చేస్తారు. విద్యార్థిని పరీక్షించి శారీరక, మానసిక వైకల్యం ఉన్న వారిని గుర్తిస్తున్నారు. విద్యార్థి తనకు తానుగా పనులు ఎలా చేసుకుంటున్నాడు, మాటలు ఎలా వస్తున్నాయి, కాళ్లు చేతుల పరిస్థితి, తల ఎలా ఉంది, పొడుగు, పొట్టి చేతులు ఇలా వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. అలాగే విద్యార్థి చదువు, చూపు ఎలా ఉంది, చిహ్నాలను అర్థం చేసుకోలేక ఇబ్బంది పడటం, బ్లాక్‌బోర్డు సరిగా కనిపిస్తుందా లేదా, చదవడం, వినడం, మాట్లాడటంతో పాటు చెప్పిన పదాన్ని పదే పదే చెప్పమనడం, రోజువారీ పనులు సొంతంగా చేసుకోలేకపోవడం, ఇతర విద్యార్థులతో పోలిస్తే తొందరగా అలసిపోవడం ఇలా 21 లోపాల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు ప్రత్యక్ష పరిశీలనతో గుర్తిస్తున్నారు. ఆ తర్వాత సదరు విద్యార్థి పరిస్థితిని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు.

రెండు భాగాలుగా 'ప్రశస్త్' యాప్...

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల వివరాలను నమోదు చేసే 'ప్రశస్త్' యాప్‌ను రెండు భాగాలుగా విభజించారు. తొలుత యాప్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాలి. మరికొన్నింటిని వారే విద్యార్థిని నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేస్తారు. యాప్‌లో మొత్తం 64 రకాల ప్రశ్నలకు సమాధానాలు పొందుపరుస్తారు. మొదటి దశలో విద్యార్థుల లోపాలు గుర్తిస్తే, రెండో దశలో ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి నిర్ధారించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.





ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ రమేష్



ప్రత్యేక అవసరాలన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

వివరాలు త్వరగా నమోదు చేయాలి



పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు త్వరితగతిన పూర్తి చేయాలి. యాప్‌నకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన సమావేశాలు నిర్వహించాం. ఉపాధ్యాయులు విద్యార్థుల లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలి.

– రమేష్, సమగ్ర శిక్షా సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్, ఒంగోలు

విద్యార్థుల లోపాలు పరిశీలించి గుర్తించాలి



ఉపాధ్యాయులు యాప్‌లో నమోదు చేసేటప్పుడే లోపంతో ఉన్న విద్యార్థిని నిశితంగా పరిశీలించి నమోదు చేయాలి. విద్యార్థుల్లో ఉన్న లోపాలను సవరించేందుకు 'ప్రశస్త్' యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులందరినీ స్క్రీనింగ్ చేయాలి.

– ఏ.కిరణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, ఒంగోలు.

వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌డీసీగా వెంకట శివరామిరెడ్డి

ఒంగోలు అర్బన్: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఆర్‌అండ్ ఆర్ ల్యాండ్ ఎక్విజేషన్ ఎస్‌డీసీ (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా వెంకట శివరామిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా ఒంగోలులో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ వరకుమార్‌ను తిరుపతి ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా బదిలీ చేశారు.

డీఆర్‌ఓను కలిసిన రెవెన్యూ ఉద్యోగులు

ఒంగోలు అర్బన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) బీ చిన్న ఓబులేసును జిల్లా రెవెన్యూ ఉద్యోగులు, పలు సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ పక్షాన అన్నీ విధుల్లో అలసత్వం లేకుండా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, రెవెన్యూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో తహశీల్దారు పీ మధుసూదనరావు, డిప్యూటీ తహశీల్దార్లు ఇతర ఉద్యోగులు ఆర్ వాసుదేవరావు, ఎన్‌వీబీ రాజేష్, బీఎస్‌సాయి శ్రీనివాసరావు, ప్రవీణ్, అశోక్‌కుమార్, సంజీవరావు, లక్ష్మీనారాయణ, షాజహాన్, శీలం శ్రీనివాసరావు, అశోక్, మధు, ఇమ్మనియేలు, రమేష్ తదితరులు ఉన్నారు.

డీఆర్‌ఓను కలిసిన వీఆర్‌ఓ సంఘ నాయకులు

ఒంగోలు అర్బన్: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌ఓ చిన ఓబులేసును వీఆర్‌ఓ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వైపీ రంగయ్య, ఏసీ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు మంగళవారం ప్రకాశం భవనంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్-2 వీఆర్‌ఓలకు గ్రేడ్-1 వీఆర్‌ఓలుగా ప్రమోషన్లు ఇచ్చే విషయం, వీఆర్‌ఓలకు సర్వే ట్రైనింగ్‌లో ఉత్తీర్ణత, ప్రొబేషన్ రెగ్యులరైజేషన్‌తో పాటు వీఆర్‌ఓల సమస్యలను చర్చించారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో కే జానయ్య, చంద్రశేఖర్, రమేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు.



డీఆర్‌ఓ ఓబులేసును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పేదల విద్యపై కూటమి కక్ష

- ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్ల జీఓ 24 కొట్టివేత
- పేదల చదువుపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వం
- ఫీజులు ఎలా కట్టాలని ఆందోళనలో తల్లిదండ్రులు
- కార్పొరేట్ సేవలకే పరిమితమైన ప్రభుత్వం
- జిల్లా వ్యాప్తంగా 969 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

ఒంగోలు సిటీ: "పేద విద్యార్థుల చదువును కేవలం ప్రభుత్వాలే కాదు ప్రైవేటు కార్పొరేట్‌లు కూడా బాధ్యత వహించాలి".. అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న మాటలు ఇవీ..."మనం మన పిల్లలకు ఏదైనా ఆస్తి ఇస్తున్నామంటే అది ఒక్క చదువు మాత్రమే నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిగా తీర్చిదిద్దుదాం.." అని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు ఇవీ.. వీరిద్దరి మధ్య తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో విద్యను వ్యాపారం చేసి మధ్య తరగతి కుటుంబాల పిల్లలను చదువుకు దూరం చేసింది. ఒక్క విద్యనే కాదు.. వ్యవసాయం, వైద్యం తదితర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అటకెక్కించింది. కేవలం ప్రతిపక్షాలపై దాడులు చేస్తూ లేనిపోని మాటలు సృష్టిస్తూ, అబద్ధాలాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ సాగిస్తోంది.

పేద విద్యార్థుల చదువుకు మంగళం..

అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు మేలు చేశారు. అన్ని ప్రైవేటు స్కూళ్లలో విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించేలా జీఓ నంబరు 24 ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. మన రాష్ట్రంలోని విద్యార్థులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని ఉద్దేశంతో నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేషన్ నాణ్యమైన విద్యను అందించారు. అంతే కాకుండా ప్రైవేటు పాఠశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజులు కూడా ప్రభుత్వం చెల్లించేలా జీఓ జారీ చేసింది.

కక్ష కట్టిన ప్రైవేటు కూటమి ప్రభుత్వం...

ఇంతలో ప్రభుత్వం మారడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీ రావడంతోనే దాడులు, అత్యాచారాలు, హత్యలతో రాష్ట్రం నాలుగు నెలలుగా అట్టుడుకుతూనే ఉంది. దీనికి తోడు ప్రైవేటు విద్యాసంస్థలు పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించడాన్ని ముందు నుంచీ వ్యతిరేకిస్తుంది. ఎలాగైనా సరే ఈ భారాన్ని తలదించుకోవాలని ఉద్దేశంతో వాళ్లు ఉన్నారు. అనుకున్నదే తడవుగా ప్రైవేటు విద్యా సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 20 శాతం సీట్లు కేటాయిస్తే మాకు ఎలాంటి ఉపయోగం ఉండదు, వీటి వల్ల ప్రభుత్వం మాకు ఫీజులు కూడా చెల్లించడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని సాకుగా తీసుకున్న కూటమి ప్రభుత్వం హైకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకపోవడంతో జీఓ నంబరు 24 ను కోర్టు కొట్టేసింది.

జిల్లాలో 969 మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం

ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు పొందిన విద్యార్థులు 969 మంది ఉన్నారు. హైకోర్టు జీఓ నంబరు 24ను కొట్టేయడంతో వీళ్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వీళ్ల ఫీజులు ఎలా చెల్లించాలి అని భయందోళన చెందుతున్నారు తల్లిదండ్రులు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన విద్య కంటే నాణ్యమైన మద్యం దొరికింది అని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.

కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం


- కంభం చెరువును సందర్శించిన యూఎన్‌డీపీ సంస్థ ప్రతినిధులు

కంభం: చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఢిల్లీకి చెందిన యూఎన్‌డీపీ (యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) సంస్థ ప్రతినిధి డాక్టర్ రుచి పంత్ అన్నారు. కంభం చెరువును ఢిల్లీకి చెందిన యూఎన్‌డీపీ సంస్థ ప్రతినిధుల బృందం మంగళవారం సందర్శించి ఫారెస్టు, ఇరిగేషన్ అధికారులు, స్థానిక రైతులతో మాట్లాడి చెరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంభం చెరువు నిర్మాణం, దాని సామర్థ్యం, చరిత్ర ఇతర వివరాలను అధికారులను అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. చెరువులో ఉన్న మత్స్య సంపద గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు, స్థానిక నాయకులు పలు అంశాలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్లుగా కంభం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక అని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ల్యాండ్ స్కేప్ ఇన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శ్రీశైలం నుంచి కంభం చెరువు వరకు పర్యావరణాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని 2026వ సంవత్సరంలో చేపట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కంభం చెరువు కట్టపై చిల్డ్రన్స్ పార్కు, మొక్కలు పెంచే కార్యక్రమం, షాపింగ్, బోటింగ్, ఇతర మౌలిక వసతులు మెరుగు పరిచి చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తమ సంస్థ తరపున కృషి చేస్తామన్నారు. డిసెంబరులో మరో సారి కంభం చెరువును పరిశీలించేందుకు వస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ శ్రీను నాయక్, ఫారెస్టు అధికారులు, రైతులు పాల్గొన్నారు.




కంభం చెరువు కట్టపై వివరాలు సేకరిస్తున్న ఢిల్లీ బృందం సభ్యులు

వందల ఎకరాలు మింగేశారు



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న పడమరవీరాయపాలెం గ్రామస్తులు



సర్వే నంబర్ 8 ప్రభుత్వ భూమిగా మీభూమి పోర్టల్‌లో చూపుతున్న అడంగల్

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం రెవెన్యూ పరిధిలో రెవెన్యూ, అటవీ శాఖకు సంబంధించిన వివాదాస్పద భూములను కొందరు ఆక్రమించి అమ్ముకుంటున్నారని పడమరవీరాయపాలెం ప్రజలు డిప్యూటీ తహసీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. సర్వే నంబర్ 8లో 527.5 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత భాగాన్ని 1988 అసైన్‌మెంట్ కమిటీ ద్వారా బీసీలు, ఎస్సీలకు అప్పటి కలెక్టర్ అబ్బన్న పట్టాలు మంజూరు చేశారు. వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదు. సబ్ డివిజన్ కూడా చేయలేదు. అది తమ భూమి అని, వివాదాస్పదంగా ఉండి కోర్టులో తాము వ్యాజ్యం వేశామంటూ అటవీ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులు రికార్డులు సమర్పించారు. దీంతో వారికి ఆ భూమిని క్యాన్సిల్ చేసి 65 సర్వే నంబర్‌లో పట్టాలు మంజూరు చేశారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది ఆక్రమణదారులు సుమారు 280 ఎకరాల భూమిని ఆక్రమించారు. గుంటూరు, వినుకొండ తదితర ప్రాంతాల వారికి దాన్ని విక్రయించారు. ఒక వ్యక్తి ఏకంగా 100 ఎకరాలకు కంచె ఏర్పాటు చేసి అందులో విద్యుత్, సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకొని దర్జాగా అనుభవిస్తూ గుంటూరుకు చెందిన వ్యక్తులకు ఎకరా రూ.2 లక్షలకు బేరం కుదుర్చుకున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో పక్క పి.దుర్గాసాంబిరెడ్డి అనే వ్యక్తి సుమారు 80 ఎకరాలు ఆక్రమించి సాగు చేసుకుంటున్నాడు. 2008లో మునీశ్వర ట్రస్టు పేరుతో 764/2008 రిజిస్ట్రేషన్ నంబర్‌తో రిజిస్టర్ చేయించాడు. అక్కడ గుడి, గోశాల ఉందంటూ అధికారులకు కొందరు సాధువులతో కలిసి మెమొరాండం సమర్పించారు. అంతటితో ఆగకుండా తహసీల్దార్ రజనీకుమారిని కలిసి సర్వే నంబర్ 8లోని భూములన్నీ మునీశ్వర ట్రస్ట్‌తో పాటు గోశాలకు చెందినవని, ఇవి రిజిష్టరై పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకుని బ్యాంకులో రుణం పొందారు. ఈ నేపథ్యంలో సాంబిరెడ్డి వద్ద ఉన్న నకిలీ పాసుపుస్తకాలు తీసుకొని వాటిపై విచారణ జరిపించాలని, పట్టాలు జారీ చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఈ నంబర్‌లో ఆక్రమణదారులు, క్రయ విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బి.రమానాయుడికి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పడమరవీరాయపాలెం మాజీ సర్పంచ్‌లు బొరిగర్ల గోవిందు, రావిపాటి శ్రీనివాసులు, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ ఊట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు 18,19,566

- మహిళా ఓటర్లు 9,13,218, పురుష ఓటర్లు 9,06,234
- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన ఎన్నికల సంఘం
- జనవరి 6వ తేది ఓటర్ల తుది జాబితా విడుదల
- మే 13వ తేదీ నాటికి జిల్లాలో 16,07,832 మంది ఓటర్లు

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా 2025 ప్రత్యేక సవరణలో భాగంగా మంగళవారం ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 18,19,566 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఏడాది మే 13వ తేదీ నాటికి జిల్లాలో 16,07,832 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్‌ఓల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించారు. మరణించిన వారు, వలస వెళ్లిన ఓట్లను తొలగించారు. దీంతో పాటు కొత్తగా దరఖాస్తు చేస్తున్న అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించారు. మాన్యువల్‌గా, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించేందుకు నవంబర్ 28వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఆ మేరకు జిల్లాలో ఉన్న అన్నీ పోలింగ్ కేంద్రాల్లో నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. జనవరి 6వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తారు.

ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు ఇవీ...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం	మే 13 నాటికి ఓటర్లు
యర్రగొండపాలెం	265	104750	101586	3	206339	207214
దర్శి	282	114100	112061	8	226169	226370
సంతనూతలపాడు	256	105002	108724	5	213731	
ఒంగోలు	259	115469	124727	52	240248	240242
కొండపి	283	118373	120826	3	239202	239609
మార్కాపురం	257	107830	106434	8	214272	214608
గిద్దలూరు	284	119318	120092	22	239432	239710
కనిగిరి	297	121392	118768	13	240173	240079
మొత్తం	2183	906234	913218	114	1819566	1607832

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు అరెస్టు

పొదిలి: మూదాలవారిపాలెం మాజీ సర్పంచ్ పెమ్మని ఓంకార్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు పోలా రమేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై వేమన ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై ప్రకటనలో తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో లావాదేవీలకు సంబంధించి రమేష్, ఓంకార్‌లకు మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఓంకార్‌పై కక్ష పెంచుకున్న రమేష్ అంతమెందించాలని కిరాయి వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈక్రమంలో ఈ నెల 5వ తేదీన ఒంటరిగా ఉన్న సమయంలో కాపు కాసి రాత్రి వేళ ఓంకార్‌పై దాడి చేశారు. తీవ్రంగా కొట్టి చనిపోయాడని భావించి వెళ్లిపోయారు. దీనికి సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను 26వ తేదీన అరెస్టు చేశారు. కాగా ప్రధాన నిందితుడు రమేష్‌ను మంగళవారం అరెస్టు చేశారు. ఘటనలో తీవ్రంగా గాయాలపాలైన ఓంకార్ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

కోడిపందేల స్థావరంపై దాడి

● 24 మంది అరెస్టు


పోలీసుల అదుపులో కోడిపందెం రాయుళ్లు

ఒంగోలు టౌన్: నగర శివారు ప్రాంతం వెంటేశ్వర కాలనీలో కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో తాలుకా పోలీసులు శిబిరంపై మంగళవారం దాడి చేశారు. దాడిలో కోడి పందేలు ఆడుతున్న 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.76,830 స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు తాలుకా సీఐ కె. అజయ్ కుమార్ తెలిపారు. తాలుకా పరిధిలో ఎవరైనా కోడి పందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి విక్రయించినా, వినియోగించినా, బెల్టు షాపులను నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈఓ


తరగతి గదిలో సైన్స్ బోధనను పరిశీలిస్తున్న డీఈఓ

ఒంగోలు సిటీ: త్రోవగుంటలోని ఆలపాటి శ్రీరాములు జెడ్పీ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఏ కిరణ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, అపార్ నమోదు, ఎస్ఏ మోడల్ పేపరు-1 మార్కుల నమోదును డీఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయుల టీచింగ్స్ నోట్సు, తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

గేదెలు ఢీకొని వ్యక్తి మృతి


మృతుని భౌతికకాయంపై విలపిస్తున్న కుటుంబసభ్యులు

పామూరు: గేదెలు ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని నుచ్చుపొద సమీపంలో 167బీ జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. నుచ్చుపొద గ్రామానికి చెందిన వ్యాపారవేత్త దేవరపు హనుమంతరావు(70) తన బైక్‌పై ఇంటికి సమీపంలోని పెట్రోల్‌బంక్‌కు వెళ్లి పెట్రోల్ కొట్టించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఇంతలో రోడ్డుపై పోట్లాడుకుంటున్న 3 గేదెలు ఒక్కసారిగా బైక్‌ను తగలడంతో ఆయన కిందపడ్డాడు. ఇంతలో గేదెలు అయనపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య ఆదిలక్ష్మమ్మ కుమారులు దేవరపు రవిబాబు, డాక్టర్ చంద్ర, కేశవరావులు ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

ఇంటికి సమీపంలోనే దుర్మరణం..

అప్పటి దాకా ఇంట్లో కుటుంబసభ్యులతో ఉండి పెట్రోల్ పట్టించుకుని వచ్చేందుకు వెళ్లిన హనుమంతరావు పని పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా..ఇంటి సమీపంలోనే మృత్యువాత పడటంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

నేడు కొండపిలో జాబ్‌మేళా

కొండపి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి జె.రవితేజ తెలిపారు. జాబ్‌మేళాలో డీమార్ట్, ఫ్లిప్‌కార్ట్, డైకిన్ సంస్థలు పాల్గొంటాయన్నారు. జాబ్‌మేళాకు 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువత అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఇస్తామన్నారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎం గోపికృష్ణ 8897964505 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాసుల కోసం.. ఇంత కక్కుర్తా..!

వేకువజామునే నిద్ర లేచి..ప్రజలంతా ఇళ్ల నుంచి బయటకు వచ్చే సరికి వీధులను, రోడ్లను శుభ్రం చేసి అద్దంలా తయారు చేస్తారు పారిశుధ్య కార్మికులు.. వారు ఒక్క రోజు పనికి రాకుంటే ఆ దుర్గంధం చెప్పేదీ కాదు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కార్మికులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. ఎవరైనా పారిశుధ్య కార్మికులను గౌరవించి వారు చేస్తున్న సేవలను గుర్తించి తమ సంతృప్తి కోసం ఎంతోకొంత ఇస్తుంటారు. కానీ మార్కాపురం మున్సిపాలిటీలో మాత్రం కూటమి నాయకులు పారిశుధ్య కార్మికుల నోర్లు కొడుతున్నారు. పారిశుధ్య కార్మికుల దగ్గర నుంచి నగదు వసూలు చేసి తలా కొంచెం పంచుకుంటడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- పారిశుధ్య కార్మికుల హాజరులో వ్యత్యాసం చూపి దోపిడీ
- కార్మికుల పొట్టకొట్టి వాటాల పంపిణీ
- కీలక సూత్రధారులు మాజీ కౌన్సిలర్, సీనియర్ శానిటరీ సెక్రటరీ
- మాట వినకుంటే విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులు


మార్కాపురం మున్సిపాలిటీ

మార్కాపురం / మార్కాపురం టౌన్:

వేకువజామునే వీధులన్నీ శుభ్రంచేసే కార్మికుల నోళ్లు కొడుతున్నారు టీడీపీ నేతలు. మార్కాపురం మున్సిపాలిటీలో టీడీపీకి చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకొని పెత్తనం చెలాయిస్తూ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అధికారులు కూడా ప్రస్తుత మున్సిపల్ పాలకుల మాట వినకుండా కూటమి కౌన్సిలర్లు చెప్పినట్టే తలాడిస్తున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో తిష్ట వేసి చక్రం తిప్పుతున్న కూటమి నేతల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

తిలా పాపం..తలా పిడికెడు

మార్కాపురం పురపాలక సంఘంలో కాంట్రాక్టు, పర్మినెంట్ శానిటేషన్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ సెక్రటరీలు ఉదయం , మధ్యాహ్నం శానిటరీ వర్కర్ల హాజరు తీసుకొని వారి వారి ఏరియాలకు పంపేవారు. దీంతో విధులకు హాజరైన వారు, హాజరుకాని వారిని లెక్కించి వారికి జీతాలు చెల్లించేవారు. అయితే గత ప్రభుత్వంలో కాంట్రాక్టు కార్మికులందరినీ ఆప్కాస్‌లోనికి తీసుకొనివచ్చి వారి హాజరును బట్టి నేరుగా వారి ఖాతాల్లోకే జీతాలను జమచేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాయకులు, కార్యాలయ ఉద్యోగులు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు కూటమిగా ఏర్పడి శానిటేషన్ వర్కర్లపై వచ్చే డబ్బును హోదాను బట్టి బాగాలేసుకుని పంచుకోవడం ప్రారంభించారు. ఈ విధానం కొందరు అధికారులకు నచ్చక మరికొంతమంది సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. శానిటేషన్ విభాగంలో ముఖ్య అధికారి శానిటేషన్‌లో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులకు ఎవరైనా ఫిర్యాదుచేస్తే ఎంక్వయిరీ చేస్తే నా తలమీదకు వస్తుందని.. ఇలాంటి వ్యవహారాలతో తలనొప్పి వచ్చేలా ఉందంటూ సన్నిహితులకు చెప్పుకుని బాధపడుతున్నారు.


విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

పేరొక చోట..పని మరో విభాగంలో..

మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు 186 మంది, పర్మినెంట్ ఉద్యోగులు 16 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పట్టణంలోని 35 వార్డుల్లో పారిశుధ్యం, చెత్తా చెదారం, మురికికాలువలు, ఇంటింటి నుంచి చెత్త సేకరించడం తదితర విధులు నిర్వహిస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే గతంలో పనిచేసిన కొందరు కాంట్రాక్టు కార్మికులను తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. పారిశుధ్య విభాగంలో తమ పేర్లను నమోదు చేయించుకుని అనధికారికంగా మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. పేరొక చోట.. పనిచేసేది మరొక విభాగంలో అన్నట్టుగా వీరి వ్యవహారం ఉందని అధికారులు చర్చించుకుంటున్నారు.

భాగ పంపకాలు ఇలా

గతంలో మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు మస్టర్ వేసి వారి వారి ప్రాంతాలకు పంపేవారు. అయితే సచివాలయం వ్యవస్థ వచ్చిన తరువాత శానిటరీ సెక్రటరీలు తమ సచివాలయ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు హాజరు వేసి విధులకు పంపేవారు. కార్మికులు తమ సొంత అవసరాల నిమిత్తం అప్పుడప్పుడూ సెలవు పెడుతుంటారు. వీరి సెలవులను నెలకు లెక్కగట్టి గరిష్టంగా సెలవు పెడితే సదరు కార్మికుడిని పిలిపించి.. నీవు పెట్టిన సెలవులకు హాజరు వేస్తాం ..కానీ జమైన నగదును మాకివ్వాలంటూ కూటమికి చెందిన మాజీ కౌన్సిలర్ హుకుం జారీ చేస్తున్నాడు. వచ్చిన నగదును మాకివ్వకుంటే మిమ్మల్ని తొలగించి వేరేవారిని నియమిస్తాం అని బెదిరిస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. అలా వసూలు చేసిన నగదును కూటమి మాజీ కౌన్సిలర్‌కు, సచివాలయం శానిటరీ సెక్రటరీలకు, మున్సిపల్ ముఖ్యాధికారులకు వాటాల ప్రాతిపదికన పంచుకుంటున్నారు. ఈ తతంగమంతా ముందుండి నడిపించేది మాత్రం సీనియర్ శానిటరీ సెక్రటరీనేనని కార్మికులు వాపోతున్నారు. పారిశుధ్య కార్మికులు ఎవరైనా డబ్బులివ్వకుంటే వారిని అదనంగా డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికుల నోర్లు కొట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

బెల్ట్ తీయాల్సిందే..

● ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: బెల్ట్ షాపులు పెట్టినా, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బెల్టుషాపులపై నిఘా పెట్టాలని, ఎక్కడ నుంచి ఎక్కడకు సరఫరా చేస్తున్నారో ఆ లింక్‌ను ఛేదించాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తే ఆ దుకాణాలను సీజ్ చేసి కేసు నమోదు చేయాలన్నారు. మద్యం దుకాణం వద్ద రేట్లను ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు నిర్ణీత సమయం ప్రకారమే తెరిచి ఉంచాలన్నారు. నాటుసారా, గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. నాటుసారాకు సంబంధించి పాత కేసుల్లో నిందితులను బైండోవర్ చేయాలని, ఎక్కువ కేసులు నమోదైన వారిపై పీడీ యాక్టు ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. నిందితులను పట్టుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని చెప్పారు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ సూపరెండెంట్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీపీఈఓ షేక్ ఖాజా మోహిద్దిన్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఈఎస్‌లు ఎర్ర వెంకట్, బాలయ్య, ఏఈఎస్ ఎన్‌ఫోర్సుమెంట్ జనార్దన్‌రావు, ఎస్పీ సీఐ రాఘవేంద్ర, సీఐలు అజయ్‌కుమార్, నాగరాజు, శ్రీకాంత్, హజరత్తయ్య, సుబ్బారావు, ఖాజావలి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్


సమావేశంలో పాల్గొన్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

చిన్నారిని తల్లి ఒడికి చేర్చిన సీసీ కెమెరా

- తల్లి స్నేహితురాలే నిందితురాలు
- కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐపై వీఆర్ వేటు
- కొత్త సీఐ గిరిబాబు నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరం
- 30 గంటల ఉత్కంఠ తర్వాత వీడిన మిస్టరీ

కావలి/పొన్నలూరు: ఊయాల్లో నుంచి అపహరణకు గురైన 15 నెలల చిన్నారి ఎట్టకేలకు 30 గంటల ఉత్కంఠ తర్వాత తల్లి ఒడికి చేరింది. పట్టణంలోని వెంగళరావునగర్‌లో సోమవారం మధ్యాహ్నం అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఓ మహిళ ఆ చిన్నారిని అపహరించి తీసుకెళ్తున్న దృశ్యాలు ఒక చోట ఉన్న సీసీ కెమెరాలో రికార్డు కావడంతో పోలీసులు మంగళవారం సాయంత్రానికి ఛేదించగలిగారు. దీంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. పట్టణ ప్రజలు కూడా ఊపిరి పీల్చుకున్నారు.

కావలిలోనే ఎస్పీ తిష్ట వేసి..

చిన్నారి తేజ అపహరణకు గురికావడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. మంగళవారం వరకు ఈ కేసులో పురోగతిలో లేకపోవడంతో మధ్య్హాం ఆగమేఘాల మీద కావలికి చేరుకున్న ఆయన చిన్నారి అపహరణ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. చిన్నారి తల్లి పల్లపు రాజేశ్వరిని విచారించారు. తొలుత ఘటన జరిగిన టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చిన్నారి అపహరణ తర్వాత దర్యాప్తుపై స్థానిక పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలోనే ఉండి దర్యాప్తును చేపట్టారు. పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. అయితే ఘటన జరిగిన ఇంటికి సమీపంలో ఓ ఇంటి యజమాని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించిన టుటౌన్ సీఐ కె.శ్రీనివాసరావు ఆ సీసీ కెమెరాల వీడియో ఫుటేజ్‌ని పరిశీలించారు. అందులో ఒక మహిళ చిన్నారిని అపహరించిన ఇంటి వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. సదరు మహిళ దిక్కులు చూస్తూ పరిసరాలను గమనిస్తూ తన చీర చెంగును ముఖానికి కప్పుకుని వెళ్లింది. కొద్ది సేపట్లోనే ఆ మహిళ 15 నెలల చిన్నారి ఎత్తుకుని అదే రోడ్డులో దర్జాగా వెళ్తున్న దృశ్యం, చిన్నారిని ముద్దాడుతూ, తన భుజంపై పడుకోబెట్టుకుని ముఖం కనిపించకుండా చేసిన దృశ్యాలు వీడియో ఫుటేజ్‌ల్లో నిక్షిప్తం అయ్యాయి. ఈ ఫుటేజీ ఆధారంగా కావలి పోలీసులతో పాటు నెల్లూరు సీసీఎస్ సిబ్బంది కూడా కావలికి చేరుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. అయితే ఈ ఘటన తర్వాత దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన టు టౌన్ సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆ స్థానంలో గిరిబాబును నియమించారు. ఆయన ఆధ్వర్యంలో దర్యాప్తును కొనసాగించారు.


బాలుడు, మహిళను కావలి పోలీసులకు అప్పగిస్తున్న ఎస్సై అనుక్

తల్లి స్నేహితురాలే నిందితురాలు

చిన్నారి తేజను తల్లి పల్లపు రాజేశ్వరికి స్నేహితురాలైన స్వరూప అనే మహిళ అపహరించినట్లు గుర్తించిన పోలీసులు ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో ఆమె సెల్‌ఫోన్, కాల్ డేటా ఆధారంగా ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్వరూప చెల్లెలు గీత కూడా కావలిలోనే ఉంటుంది. తొలుత పోలీసులు గీతను విచారించగా, తన అక్క ఇంట్లో చిన్నారి అపహరించినప్పుడు ధరించిన చీర ఉన్నట్లుగా చెప్పింది. ఎక్కడికి వెళ్లి ఉంటుందో ఆనవాళ్లు చెప్పింది. స్వరూపకు ఫోన్ చేస్తుంటే సక్రమంగా సమాధానం చెప్పకుండా దాటవేస్తోంది. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో స్వరూప పొన్నలూరులో ఉన్నట్లు గుర్తించారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం పొన్నలూరులో ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో అక్కడి పోలీసులను అలెర్ట్ చేయడంతో స్వరూపను, చిన్నారి అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నాకాబందీతో పట్టుబడిన మహిళ

చిన్నారి తేజను అపహరించిన సదరు మహిళ కారు అద్దెకు తీసుకుని వింజమూరు మీదుగా మార్కాపురం చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి కారులోనే తిరుగుతూ సాయంత్రం సమయంలో కనిగిరి ప్రాంతానికి చేరుకుంది. అయితే తేజ అపహరణకు గురైన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పొన్నలూరు ఎస్సై కె.అనుక్ తన సిబ్బందితో సాయంత్రం నాగిరెడ్డిపాలెం అడ్డరోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కారులో చిన్నారితో ఉన్న మహిళను గుర్తించి విచారించగా ఆమె మాటలు, ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు కావలి పోలీసులు పొన్నలూరుకు వెళ్లి చిన్నారిని, అపహరణకు పాల్పడిన స్వరూపను కావలి మంగళవారం రాత్రి తీసుకు వచ్చారు. చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారిని అపహరించడానికి నేపథ్యంపై మహిళ స్వరూపను పోలీసులు విచారిస్తున్నారు.



చిన్నారిని ఎత్తుకెళ్తున్న మహిళ..సీసీ కెమెరా ఫుటేజీ

చిన్నారి పెంచుకోవాలని..

కావలిలోనే నివాసం ఉంటున్న స్వరూప, చిన్నారి తల్లి స్నేహితులు. చిన్నారి ఇంటికి స్వరూప తరచూ వస్తుండేది. ఈ క్రమంలో పిల్లలు లేని స్వరూప చిన్నారి తేజను తీసుకెళ్లి పెంచుకోవాలని భావించింది. సోమవారం స్వరూప తన స్నేహితురాలు ఇంటికి వెళ్లింది. చిన్నారి ఊయాల్లో ఉండడం, స్నేహితులు కనిపించకపోవడంతో తన ప్లాన్‌ను అమలు చేసినట్లు తెలుస్తోంది. చిన్నారిని అపహరించి, అప్పటి వరకు తాను కట్టుకున్న చీరను విడిచి వేరే డ్రస్ ధరించి జిల్లా సరిహద్దులు దాటి వెళ్లిపోయింది.

సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేస్తా: ఎమ్మెల్యే దగుమాటి

కావలి పట్టణంలో సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడతామని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి చెప్పార్చు. అపహరణకు గురైన చిన్నారి తల్లిని ఆమె నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరా వల్లనే చిన్నారి అపహరణను పోలీసులు ఛేదించగలిగారని చెప్పారు. కావలిలో ప్రజలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వ్యాపారస్తులు తదితరుల సహకారంతో సీసీ కెమెరాల వ్యవస్థను సంపూర్ణంగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● ఎస్పీ దామోదర్


రక్తదాన శిబిరంలో ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మంది రక్తస్రావంతోనే మరణిస్తున్నారని అనేక నివేదికలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కిమ్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం పోలీసు కళ్యాణ మండపంలో మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..సమాజ శ్రేయస్సు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరుల స్ఫూర్తితో జిల్లాలోని అన్నీ పోలీసుస్టేషన్ల పరిధిలో రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, కాన్పులు, అత్యవసర ఆపరేషన్లు, ప్రాణాంతకమైన వ్యాధులతో సకాలంలో రక్తం అందకపోవడంతో అనేక మంది మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. రక్తదానం చేసే విషయంలో ఎలాంటి అపోహలకు తావులేకుండా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అవసరమైతే రక్తం చిందిస్తారని, ప్రజలు అపాయంలో ఉన్నప్పుడు మేమున్నామంటూ రక్తం అందిస్తారన్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, వైద్యులు సుబ్బారావు, లియా హల్లన్, సింధూర, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, తాలుకా సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ వై. నాగరాజు, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాలంటూ వేధింపులు

● మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు


వినతిపత్రం చూపుతున్న డీలర్ లక్ష్మి

పొదిలి: చౌక ధరల దుకాణాల డీలర్‌గా రాజీనామా చేయాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని కాటూరివారిపాలెం 27వ నెంబర్ దుకాణం డీలర్ మన్నెం లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. వారి వేధింపులు తట్టుకోలేక మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు లక్ష్మి తెలిపారు. గత నెల రోజులుగా రేషన్ దుకాణం దగ్గరకు వచ్చి తెల్ల కాగితంపై సంతకం చేయమని ఒత్తిడి తెస్తున్నారని, లేకుంటే దుకాణం తనిఖీ చేసి కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబం ఈ పనితోనే జీవనం సాగిస్తుందన్నారు. తన కుటుంబ పరిస్థితి బాగా లేదని, ఇంట్లో ఆయనకు రోడ్డు ప్రమాదం జరిగిందని, పాపకు హార్ట్ సర్జరీ అయిందని వాపోయారు. ఈ పరిస్థితుల్లో డీలర్ పని కూడా లేకపోతే కుటుంబం రోడ్డున పడుతుందని ఎంత వేడుకున్నా అధికారులు వేధింపులు మానడం లేదని చెప్పారు. అధికారుల వేధింపులపై మానవ హక్కుల కమిషన్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, వారు విచారణ చేస్తామని హామీ ఇచ్చినట్లు లక్ష్మి తెలిపారు. తనకు వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మి కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా


ఘటనా స్థలంలో వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై

దర్శి: సాగర్ కాలువలో ఈతకు దిగి ఊపిరాడక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై మురళీ తెలిపిన వివరాల మేరకు..దొనకొండ మండలం గట్టుమీదపల్లి గ్రామానికి చెందిన తలమంచి అశోక్ అదే గ్రామానికి చెందిన శివ కృష్ణ, వెంకటకృష్ణలతో కలిసి దర్శికి వచ్చారు. దర్శిలో ఉన్న వెంకటేశ్వర్లు అనే స్నేహితుడితో కలిసి పొదిలిరోడ్డులోని సాగర్ కాలువ వద్ద మద్యం సేవించడానిక వెళ్లారు. మద్యం సేవిస్తూ అశోక్ ఈతకొట్టేందుకు కాలువలోకి దూకాడు. కాసేపు ఈతకొట్టిన తరువాత ఊపిరాడక మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.